చిట్కా

దుస్తులపై పడిన

## మరకలు పోవాలంటే...

✓ పండ్ల మరకలను పోగొట్టడానికి స్టార్చ్‌ను పేస్ట్‌లా రాసి ఒక గంట ఉంచాలి. ఆ తరువాత వేడి నీటితో శుభ్రం చేయాలి. ఎండిన మరకలయితే బొరాక్స్ లేదా ఉప్పు రాసి వేడినీటితో మరక పోయేంత వరకు రుద్దాలి.

✓ రక్తపు మరకలు పడితే చల్లటి నీళ్ళలో నానబెట్టి, డైల్యూట్ అమ్మోనియాతో శుభ్రపరచాలి. ఎండిపోతే ఉప్పు కలిపిన చల్లటి నీటితో నానబెడితే చాలు మరకపోతుంది.

✓ అరటికాయ మరక పోవాలంటే ముందుగా డైల్యూట్ పొటాషియం పర్మాంగనేట్ సొల్యూషన్‌రాసి, ఆ తరువాత సోడియం బైసల్ఫేట్‌తో శుభ్రం చేయవచ్చు. ఎండినదయితే సాల్‌వెంట్‌సోప్ వాడి పోగొట్టవచ్చును.



'కన్యాశుల్కం' చిత్రం లో సి.ఎస్.ఆర్, గోవిందరాజు సుబ్బారావు, సావిత్రి

సినిమా...

# సాంఘిక దురాచారాన్ని తూర్పారబట్టిన 'కన్యాశుల్కం'

తెలుగు నాటక రంగాన్ని ఓ మలుపు తిప్పిన 'కన్యా శుల్కం' నాటకం సామాజిక ప్రయోజనాన్ని ఉద్దేశించింది. గురజాడ అప్పారావు రచించిన ఈ నాటకం పుట్టి 113 ఏళ్లు దాటుతున్నా నేటికీ సజీవంగానే ఉంది. సమస్య పాతబడి నప్పటికీ ఆ నాటకం సజీవంగా ఉండటానికి కారణం అందులోని పాత్రలకు సర్వకాలీనత ఉండటమే. ఇప్పుడు వరకట్నం ఉన్నట్లుగానే ఒకప్పుడు కన్యాశుల్కం ఉండేది. డబ్బుకోసం ఆశపడి తల్లిదండ్రులు తమ పిల్లలను రజస్వల కాకముందే ఎక్కువ కన్యాశుల్కం ఎవరిస్తారో వారికి వయసుతో కూడా నిమిత్తం లేకుండా అమ్మేసేవారు. దాం తో వృద్ధులను పెళ్లాడిన ఆ చిన్నపిల్లలు యుక్తవయసు వచ్చేసరికి భర్తను కోల్పోయి వితంతువులుగా మారేవారు. జీవితాంతం ఏ ఆనందానికి నోచుకోక జీవచ్ఛవంలా బతుకుతూ ఉండేవారు.

ఆనాటి సమాజంలో ఇది సర్వత్రా కనిపించే దృశ్యం. ఈ అనాగరిక సంప్రదాయాన్ని తూర్పారపడుతూ గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' నాటకాన్ని రచించాడు. క్లాసిక్‌గా అందరి ప్రశంసలు పొందినప్పటికీ ఈనాటకాన్ని సినిమాగా మలిచే సాహసం ఆ రోజులలో ఎవరూ చేయలేకపోయారు. నిజం చెప్పాలంటే 'కన్యాశుల్కం' నాటకాన్ని యథాతథంగా వెండితెరపై ఆవిష్కరింపచేయాలంటే అది ఆరు గంటల సినిమా అవుతుంది. నిర్మాతలు ముందుకు రాకపోవడానికి ఇది కూడా ఒక కారణం. అయితే అభిరుచి కలిగిన నిర్మాత డి.ఎల్.నారాయణ సాహసించి నాటకాన్ని సినిమాకు అనుగుణంగా కుదించి వినోదా బ్యానర్‌పై ప్రేక్షకులకు అందించారు. ఈ చిత్రానికి పి.పుల్లయ్య దర్శకత్వం వహిం చారు. 'కన్యాశుల్కం'లో కీలకపాత్ర గిరీశం. ఇతగాడు అవకాశవాది. ఏ ఎండకు ఆ గొడుకు పట్టేరకం. లెక్చర్లు ఇస్తూ, ఎవరికీ అర్థంకాని ఇంగ్లీషులో మాట్లాడుతుంటాడు. గిరీశం నెగిటివ్ క్యారెక్టర్ కాదుకానీ తనస్వార్థం కోసం ఏమయినా చేసేరకం. అయితే సినిమాలో ఎన్.టి. రామారావువంటి అగ్రశ్రేణి నటుడు ఆ పాత్రను పోషిం చడంతో ఆయన ఇమేజ్‌కి అనుగుణంగా కొన్ని మార్పులు చేశారు. గిరీశం పాత్రనే సినిమాలో హీరోగా మలిచి, చివర్లో వితంతువు బుచ్చెమ్మని అతను వివాహం చేసుకోవడం చూపించి కథను సుఖాంతం చేశారు. సినిమాలో చేసిన ఈ మార్పులు విమర్శకుల ఆగ్రహానికి గురయ్యాయి. అందుకే ఈ సినిమా విడుదలయినప్పుడు జనం పెద్దగా ఆదరించలేదు. గురజాడకు అన్యాయం జరిగిందని అనేకమంది విమర్శించారు. అయితే తిరిగి 22 ఏళ్ల తర్వాత విడుదలయిన 'కన్యాశుల్కం' చిత్రానికి ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. ప్రేక్షకుల అభిరుచిలో వచ్చిన మార్పులే చిత్ర విజయానికి కారణాలు.

తెలుగు చిత్ర పరిశ్రమలోని మహామహులంతా 'కన్యా శుల్కం' చిత్రంలో నటించడం విశేషం. యజ్ఞావధాన్లుగా గోవిందరాజు సుబ్బారావు, అగ్నిహోత్రావధాన్లుగా విన్నకోట రామన్నపంతులు, రామప్ప పంతులుగా సి.ఎస్.ఆర్, మధురవాణిగా సావిత్రి, బుచ్చెమ్మగా షావుకారు జానకి, సౌజన్యరావు పంతులుగా గుమ్మడి, కరటక శాస్త్రిగా వంగర, వలిశెట్టిగా వంగర, కానిస్టేబుల్‌గా పేకేటి నటించా రు.ఘంటసాల సంగీతం సమకూర్చగా మల్లాది రామకృష్ణశాస్త్రి మధురమైన గీతాలను రాశారు. గురజాడ వారి 'పుత్తడిబొమ్మ పూర్ణమ్మ'ను నృత్యరూపకంగా చూపించారు. అలాగే శ్రీశ్రీ రాసిన 'ఆనందం అర్ణవమైతే' గీతాన్ని కూడా చిత్రంలో సందర్భోచితంగా వాడుకున్నారు.

-జయ